క్లుప్తంగా

కరపత్రాల విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న సరోజ

నల్లగొండ టౌన్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రక్షణ కోసం ఈ నెల 10 హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండంపల్లి సరోజ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో రాష్ట్ర సదస్సు కరపత్రాలను విడుదల చేసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వామపక్షాల పోరాట ఫలితంగా ఏర్పడిన ఉపాధి హామీ పథకానికి బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌ను తగ్గిస్తూ నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తోందన్నారు. కార్యక్రమంలో వడ్డె ధనమ్మ, ఇందిర, వరికుప్పల తిరుపతమ్మ, నిరంజన్, పద్మ, పర్వతం బొందయ్య, వడ్డె రాంరెడ్డి, కంకనాల విజయ, సంధ్య, పార్వతమ్మ, మల్లయ్య, గోల్కొండ కళమ్మ పాల్గొన్నారు.

క్లీన్ హోం- గ్రీన్ హోం



మొక్క నాటుతున్న కాలనీవాసులు

నల్లగొండ: క్లీన్ హోం–గ్రీన్ హోం కార్యక్రమంలో భాగంగా ఆదివారం నల్లగొండలోని మిథుల కాలనీలో కాలనీవాసులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆదిమల్ల మణిరాజు, వేముల శేఖర్, గాదె లింగస్వామి, సందీప్, సన్నీ, సిద్విక్‌కుమార్, అరుణ్, మాధవ్ పాల్గొన్నారు.

ఎస్టీయూ టీఎస్ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న వీరరాఘవులు

నల్లగొండ: ఎస్టీయూ టీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నల్లగొండలోని ఎస్టీయూ భవనలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు జి.విజయప్రసాద్ జెండా ఎగురవేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు కొనకంచి వీరరాఘవులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాటం చేయడంలో ఎస్టీయూ ముందుంటుందన్నారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎం.రమేష్, పోలగోని వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్‌రావు, పర్వతాలు, శంకరయ్య, లాలు, శివలింగయ్య, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి



యాదయ్య (ఫైల్)

నార్కట్‌పల్లి : చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని అక్కెనపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. మండల పరిధిలోని అక్కెనపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొమ్ము యాదయ్య ఏప్రిల్ 5 తేదీన తన పుట్టిన రోజు సందర్భంగా గ్రామంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేసేందుకు నార్కట్‌పల్లి నుంచి అక్కెనపల్లికి ఆటోలో పండ్లు తీసుకుపోతున్నాడు. ఈ క్రమంలో మండల పరిధిలోని మాధవ ఎడవల్లి గ్రామ శివారులో ఆటో బోల్తా పడడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం యాదయ్యను నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

నార్కట్‌పల్లి : మండల కేంద్రానికి చెందిన చేపూరి రాజు ఇటీవల పాముకాటుకు గురై మృతి చెందాడు. దీంతో నార్కట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అన్ని తరగతుల పూర్వ విద్యార్థుల సంఘం (స్వాస్ సంస్థ)ఆధ్వర్యంలో ఆదివారం రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.52 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు మామిళ్ల సత్తిరెడ్డి, మెరుగు శ్రవణ్, దామెర నవీన్, కన్నెబోయిన సైదులు, గూడూరు అంజిరెడ్డి, మామిడి సుధాకర్‌రెడ్డి, అంతటి రవి, పులిజాల నర్సింగ్‌రావు, సంధ్య, జానయ్య, అమరేందర్, వెంకన్న, రాజు, మాధవి, జ్యోతి, వంకర్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

సబ్సిడీ విత్తనాలు ఇచ్చేది ఎప్పుడు !

- మునుగోడు మండలంలో దాదాపు 50 వేల ఎకరాల్లో పంటల సాగు
- నేటికీ సరఫరా కాని విత్తనాలు
- ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు



దుక్కి దున్నుతున్న రైతు

మునుగోడు: రైతులపై ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు ప్రతి సీజన్ ప్రారంభంలో ప్రభుత్వం పంటల సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలను సబ్సిడీపై అందిస్తోంది. అయితే ఈ ఏడాది వానాకాలం సీజన్ ప్రారంభమైనప్పటికీ నేటికీ రైతులకు విత్తనాలను సబ్సిడీపై అందించడం లేదు. దీంతో గత్యంతరం లేక పలువురు రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద విత్తనాలను అధిక ధరకు కొనుగోలు చేసి పంటలు సాగు చేస్తున్నారు. గతంలో వరి, కంది, పెసర, ఇతర విత్తనాలను బహిరంగ మార్కెట్‌కు కంటే 50 శాతం తక్కువకు ప్రభుత్వం ఇచ్చేది. కానీ ఈ ఏడాది సబ్సిడీ విత్తనాలు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

అధికంగా పత్తి సాగు..

మునుగోడు మండలంలోని 26 గ్రామాల్లో దాదాపు 18 వేల మంది రైతులు 50 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. అందులో 38 వేల ఎకరాల్లో పత్తి, 10 వేల ఎకరాలకు పైగా వరి, 1500 నుంచి 2 వేల ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగు చేస్తుంటారు. పత్తి విత్తనాలు ప్రభుత్వం నిర్ణయించి ధరకు విక్రయించాలని ఆదేశించడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద కొనుగోలు చేసి పంటలు సాగు చేస్తున్నారు. ఇక వరి విత్తనాలకు ప్రభుత్వం ఎలాంటి ధర నిర్ణయించకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గతంలో వరి రూ.800 నుంచి రూ.850 ఉన్న 25 కేజీల విత్తనాలను ఇప్పుడు రూ.1100 నుంచి రూ.1200 లకు విక్రయిస్తున్నారు. అదే ప్రభుత్వం సబ్సిడీ అందిస్తే 25 కేజీల బస్తా రూ.750 లకే లభించేది. ఇప్పుడు సబ్సిడీ విత్తనాలు లేకపోవడంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక ధరకు కొనుగోలు చేస్తున్నారు. వరి విత్తనాలతోపాటు వాణిజ్య పంటలైన కంది, పెసర, బొబ్బర తదితర విత్తనాలు కూడా సబ్సిడీలో అందుబాటులో లేకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్దనే కొనుగోలు చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రైతులకు సబ్సిడీ విత్తనాలు అందుబాటులో ఉండేలా చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

సబ్సిడీ విత్తనాలు అందుబాటులో ఉంచాలి



వరి విత్తనాలను గతంలో 25 కేజీల బస్తా రూ.850 నుంచి రూ.900లకు ఇచ్చే ప్రైవేటు వ్యాపారులు ఇప్పుడు రూ.1100లకు పైగా అమ్ముతున్నారు. గతంలో సబ్సిడీ ద్వారా రూ.720కే బస్తా వచ్చేది. ఇప్పుడు సబ్సిడీ అందుబాటులో లేకపోవడంతో అదనంగా బస్తాకు రూ. 400 చెల్లించాల్సి వస్తుంది. సబ్సిడీ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలి.

–శిరగమళ్ల వెంకన్న, రైతు చీకటిమామిడి

ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు



సబ్సిడీ విత్తనాల విషయంలో ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ నెల 5వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సబ్సిడీ విత్తనాలు సరఫరా చేయలేదు. ఇటీవలే ఎన్నికల కోడ్ ముగిసింది. వారం, పది రోజుల్లో రైతులకు సబ్సిడీ విత్తనాలు అందుబాటులోకి రావొచ్చు. ఇప్పటివరకు మాకు ఎలాంటి సమాచారం లేదు.

–ఎస్.శ్రీనివాస్‌గౌడ్, మండల వ్యవసాయ అధికారి

నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యం

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం: తుంగతుర్తి నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదిన్నరేళ్లు పాలన సాగించిన బీఆర్ఎస్ నాయకులు నియోజకవర్గ అభివృద్ధిని మరిచి అక్రమ సంపాదన, వనరుల దోపిడీ ధ్యేయంగా పనిచేశారన్నారు. నియంతృత్వ పాలన సాగిస్తూ నియోజకవర్గంలోని బిక్కేరు, మూసీనది నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడి సొమ్ముచేసుకున్నారని ఆరోపించారు. శాలిగౌరారం, అర్వపల్లి మండలాల పరిధిలో ఉన్న మూసీ ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గడంతో రాష్ట్ర ప్రభుత్వ అనుమతులతో టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో మూసీ ప్రాజెక్టులో పూడికతీత (డీసిల్టింగ్) చేపట్టామన్నారు. పూడికతీతతో వచ్చిన ఇసుకను ఆన్‌లైన్ పద్ధతిలో పూర్తి పారదర్శకతతో ప్రాజెక్టుల నిర్మాణం కోసం వినియోగిస్తామన్నారు. విషయ పరిజ్ఞానం లేని కొంతమంది తనపై తప్పుడు ఆరోపణలతో పబ్బం గడుపుకుంటున్నారన్నారు. శాలిగౌరారం మండలాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, అన్నెబోయిన సుధాకర్, బండపల్లి కొమరయ్య, చాడ సురేశ్‌రెడ్డి, పాదూరి శంకర్‌రెడ్డి, నోముల జనార్దన్, గూని వెంకటయ్య, ఎర్ర చైతన్య, బండారు మల్లయ్య, తీర్పారి మల్లయ్య, చింత ధనుంజయ్య, వేముల కిరణ్‌కుమార్, నక్క మల్లేష్, రవి, నరేశ్, సతీష్, సత్తయ్య, పరమేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌కు నివాళి

శాలిగౌరారం మండలంలోని తిరుమలరాయినిగూడెంకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వడ్లకొండ శంకర్ ఇటీవల మృతి చెందాడు. ఆదివారం తిరుమలరాయినిగూడెంలోని జరిగిన శంకర్ దశదినకర్మలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొని శంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, చాడ సురేశ్‌రెడ్డి, అన్నెబోయిన సుధాకర్, కర్నాటి కృష్ణ, వడ్లకొండ నాగయ్య, పడాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు కాలువ పునరుద్ధరణ పనులు ప్రారంభం

మాడుగులపల్లి : మండలంలోని చెరువుపల్లి గ్రామ చెరువు కాలువ పునరుదరణ పనులను ఆదివారం తిప్పర్తి జడ్పీటీసీ, చంద్రం ఫౌండేషన్ చైర్మన్ తండు సైదులుగౌడ్ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. వర్షాలు కురిస్తే ఎగువ నుంచి వచ్చే వరద చెరువులోకి చేరేలా కాలువ పూడికతీత పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు రూ.13 లక్షలు సొంతంగా వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. చెరువుపల్లి రైతులకు ఇబ్బంది లేకుండా ఏటా సొంత నిధులు వెచ్చించి కాలువ పనులు చేయిస్తున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూదిరెడ్డి సుమలత, తాజామాజీ సర్పంచ్ సైదమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్డే సైదిరెడ్డి, సాగర్, ప్రభాకర్‌రెడ్డి, రామస్వామి, కరుణాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డి, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం

మిర్యాలగూడ : క్రీడలతో శారీరక దారుఢ్యం ఏర్పడుతుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన హ్యాండ్ బాల్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చదువుతోపాటు క్రీడారంగంలో కూడా మంచి గుర్తింపు సాధించవచ్చన్నారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులకు టీ షర్ట్స్ పంపిణీ చేసి శిక్షణ ఇచ్చిన కోచ్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



నకిరేకల్ : సంబరాలు చేసుకుంటున్న నాయకులు



చండూరు : పుల్లెంల గ్రామంలో ..

నకిరేకల్ : నరేంద్రమోదీ మూడోసారి భారత ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయడంతో నకిరేకల్‌లో ఆదివారం రాత్రి బీజేపీ ఓబీసీ జిల్లా నేత వంగూరు సైదులు ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సాయన్న, శ్రీను, రామ్మూర్తి, సైదులు, రోశయ్య, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చండూరు : నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం చండూరు మండలంలోని పుల్లెంల గ్రామంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. చౌరస్తాలో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు పిన్నింటి నరేందర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, నకిరేకంటి లింగస్వామిగౌడ్ తదితరులు ఉన్నారు.



శాలిగౌరారంలో..

శాలిగౌరారం: ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా మండలకేంద్రంలో ఆదివారం రాత్రి బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద బాణసంచాకాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు జమ్ము రమేశ్, గోదల సురేశ్‌రెడ్డి, తోట వినోద్, బోడ రాజు, అయితగోని గణేశ్, చాడ శ్యాంసుందర్‌రెడ్డి, మల్లయ్య, గట్టయ్య, నర్సింహ, సైదులు, శంకర్, సుమన్, యాదగిరి, కిష్టయ్య, హరిబాబు పాల్గొన్నారు.

పాల్వాయి గోవర్ధన్‌రెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

చండూరు : మాజీ మంత్రి పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి 7వ వర్ధంతిని చండూరు మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గోవర్ధన్‌రెడ్డి విగ్రహానికి కుమార్తె బీఆర్ఎస్ నాయకురాలు పాల్వాయి స్రవంతి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మారుమూల గ్రామంలో జన్మించి మునుగోడు శాసనసభ్యుడిగా, మంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా గోవర్ధన్‌రెడ్డి రాష్ట్రానికి, నియోజకవర్గానికి ఎన్నో సేవలు అందించాడన్నారు. చండూరు మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొత్తపాటి సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ, కౌన్సిలర్లు తోకల వెంకన్న, అన్నెపర్తి శేఖర్, కోడి వెంకన్న, కో ఆప్షన్ సభ్యులు రావిరాల నగేష్, శిరంశెట్టి శ్రీధర్‌బాబు, తేలుకుంట్ల జానయ్య, కట్ట అంజయ్య, తేలుకుంట్ల చంద్రశేఖర్, పున్న సైదులు, ఇరిగి రామన్న, గండూరి నగేష్, ఇరిగి రామకృష్ణ, రావిరాల నగేష్, కొలుగూరి రాంగోపాల్, రాపోలు జగదీశ్, స్వామిగౌడ్, భూతరాజు యాదగిరి, కొత్త అంజిబాబు, అన్నెపర్తి యాదగిరి, సురేష్, శ్రవణ్, అబ్దుల్, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ శిబిరం



మాట్లాడుతున్న గోలి అమరేందర్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : నల్లగొండలోని పెరుమాళ్ల హాస్పిటల్‌లో రెండు రోజులుగా నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ గోలి అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ శిబిరంలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. హైదరాబాద్‌కు వెళ్లి పరీక్షలు చేయించుకోవడానికి స్థోమత లేని పేదవారికి ఈ ఉచిత వైద్యశిబిరం ఎంతగానో ఉపయోగపడిందన్నారు. రేపాల మదన్‌మోహన్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు నిండిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో భాగస్వాములైన వారికి సన్మానం చేసి, ప్రశంసా పత్రాలను అందజేశారు. లయన్స్ క్లబ్ జిల్లా వైస్ డిస్ట్రిక్ గవర్నర్ 2 కేవీ ప్రసాద్, లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ అధ్యక్షుడు ఎల్వీ కుమార్, గట్టుపల్లి అశోక్‌రెడ్డి, సతీష్ కుమార్ కోడె, డాక్టర్ పుల్లారావు, నిమ్మల పిచ్చయ్య, మందడి శంకర్‌రెడ్డి, వీరవెల్లి సత్యనారాయణ, గుండెబోయిన లింగయ్య, సరళ, సరిత, అన్సారి, ఎల్వీ యాదవ్, జగిని పద్మాకర్, పున్న చండీశ్వర్, పెరుమాళ్ల వరుణ్ కుమార్, డాక్టర్ అవంతి, డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి, డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, పర్యావరణ ప్రేమికుడు సురేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



నకిరేకల్ : సమ్మేళనంలో పాల్గొన్న ఏవీఎం స్కూల్ పూర్వ విద్యార్థులు



శాలిగౌరారం: మాధారంకలాన్ జెడ్పీ హైస్కూల్‌లో..

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నకిరేకల్ : మున్సిపల్ కేంద్రంలోని ఏవీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 2001–02 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. కార్యక్రమంలో ఏవీఎం విద్యాసంస్థల అధినేత కందాల పాపిరెడ్డి, ఉపాధ్యాయులు రాంరెడ్డి, పోతుల వెంకటనారాయణ, సత్యనారాయణ, సామంతపురి మురళి, ఎం.రాములు, శ్రీనివాస్, భిక్షమాచారి తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: వెలిమినేడు జెడ్పీహెచ్ఎస్‌లో 2005–06 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఆనాడు వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. గోలి మహేష్, నాగరాజు, కాటం సత్తయ్య, నగేష్, అర్రూరి పాండు, సరస్వతి, రేఖ, నాగేశ్వరి పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలంలోని మాధారంకలాన్ జెడ్పీ ఉన్నత పాఠశాల 2006–07 విద్యా సంవత్సరం ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నాడు విద్యా బోధన చేసిన ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసారావు, కృష్ణారెడ్డి, కాశీం, లింగారెడ్డి, ప్రద్యుమ్నాచారి, కిరణ్‌లను పూలమాలలు, శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. మొదటగా అశువులుబాసిన పాఠశాలకు చెందిన సహచర మిత్రులు, ఉపాధ్యాయుల చిత్రపటాలకు నివాళులర్పించారు.



చిట్యాల: వెలిమినేడులో..

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం



బొడ్రాయికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో బొడ్రాయి వార్షికోత్సవం, కోట మైసమ్మ, కట్టమైసమ్మ, మారెమ్మ ఆలయాల ఉత్సవాలను ఆదివారం ఆ గ్రామస్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. వేడుకల్లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని బొడ్రాయి, ఆయా ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, డీసీసీ ఉపాధ్యక్షుడు కందిమళ్ళ శిశుపాల్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నీలకంఠం లింగస్వామి, మాజీ ఎంపీటీసీ ఎద్దులపురి కృష్ణ, నూతి వెంకటేశం, తెల్సూరి సైదులు, మారగోని ఆంజనేయులు, కుక్కల మోహన్, కోనేటి యాదగిరి, బెల్లి సత్తయ్య, సిలివేరు శేఖర్ పాల్గొన్నారు.

‘ప్రగతి’ విద్యార్థుల ప్రతిభ



హరిచక్రవర్తి



ఆకాష్



రాహుల్

నల్లగొండ: ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నల్లగొండలోని ప్రగతి జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చాటారు. ప్రగతి కాలేజీకి చెందిన ఆర్.రాహుల్ 207వ ర్యాంకు, ఎన్.హరిచక్రవర్తి 483 మార్కులు, ఎ.ఆకాష్ 1390, జి.శివప్రసాద్ 5545 ర్యాంకులు సాధించి చరిత్ర సృష్టించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, అధ్యాపకులను కళాశాల చైర్మన్ చందా కృష్ణమూర్తి, డైరెక్టర్లు ఎ.నరేందర్‌బాబు, ఎన్.శశిధర్‌రావు, చందా శ్రీనివాస్, పైళ్ల రమేష్‌రెడ్డిలు అభినందించారు.

ఐక్యంగా ఉంటేనే సమస్యల పరిష్కారం

మిర్యాలగూడ అర్బన్ : ఆటో డ్రైవర్లు ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయమని ఆటో మోటార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మోహమ్మద్ నాజర్ అలీమీర్జా అన్నారు. ఆదివారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆటో యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, డ్రస్ కోడ్ పాటించాలని, ఆటోలకు సంబంధించిన పత్రాల దగ్గర ఉంచుకోవాలని సూచించారు. సోహెల్, బిక్షం, సైదులు, ఫకీరా, హలీం, శ్రీను, గోవింద్, గోవర్ధన్ తదితరులున్నారు.

నీట్ ఫలితాలపై విచారణ చేపట్టాలి

నల్లగొండ టౌన్ : నీట్ ఫలితాలపై విచారణ చేపట్టాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లం మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ పరీక్ష నిర్వహణ తీరుపై సమగ్ర విచారణ నిర్వహించి విద్యార్థులందరికీ న్యాయం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కట్టెల లింగస్వామి, భిక్షపతి, కార్తిక్, రాము పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

నల్లగొండ టౌన్ : నల్లగొండ పట్టణంలోని లతీఫ్ సాహెబ్ దర్గా వద్ద బాటసారులకు, పేదలకు న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శివలీల మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వృద్ధులకు, దివ్యాంగులకు తమకు తోచిన సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పుడమి సాహితీ వేదిక అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి , కంబాల భూపాల్‌రెడ్డి, సీహెచ్.లక్ష్మీబాయి పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

- రెండు సంవత్సరాలు కావొస్తున్నా ఎక్కడి స్తంభాలు అక్కడే
- కనీస చర్యలు చేపట్టని అధికారులు
- ఆందోళన చెందుతున్న వాహనదారులు



శాలిగౌరారం-గురుజాల ప్రధాన రోడ్డు వెంట ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

శాలిగౌరారం: అధికారుల అలసత్వం..కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల ఇటు వాహనదారులు, అటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయి రెండు సంవత్సరాలు కావొస్తున్నా రోడ్డువెంట ఉన్న విద్యుత్ స్తంభాలను మాత్రం నేటికీ తొలగించలేదు. మండల కేంద్రంలో శాలిగౌరారం–గురుజాల రోడ్డును 2022లో రూ.1.50 కోట్ల వ్యయంతో 700 మీటర్ల పొడవు డబుల్ రోడ్డుగా అభివృద్ధి పరిచారు. రోడ్డు నిర్మాణ పనులను నాటి తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ 29 మార్చి 2022 న ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ పనులను అక్టోబర్ 2022లో పూర్తిచేశారు. మండల కేంద్రం నుంచి గురుజాల వరకు ఉన్న సింగిల్ రోడ్డును 5 కిలోమీటర్ల బీటీ రెన్యూవల్ పనులకు నాటి ప్రభుత్వం రూ.1.50 కోట్లు నిధులు మంజూరు చేసింది. కానీ సింగిల్ రోడ్డు బీటీ రెన్యూవల్‌కు బదులు 700 మీటర్లు పొడవు డబుల్ రోడ్డుగా నిర్మించేందుకు నిధులను మార్పిడి చేశారు.

తొలగింపునకు నోచుకోని విద్యుత్ స్తంభాలు

మండల కేంద్రంలో చేపట్టిన 700 మీటర్ల పొడవు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న హైటెన్షన్ విద్యుత్ స్తంభాలు తొలగించవలసి ఉన్నప్పటికీ పనులు పూర్తయి రెండు సంవత్సరాలు కావొస్తున్నా నేటికీ హైటెన్షన్ విద్యుత్ స్తంభాలు ఎక్కడికక్కడే ఉన్నాయి. సింగిల్‌రోడ్డు డబుల్ రోడ్డుగా మార్పు చెందడంతో వాహనదారులు గరిష్ఠ వేగంతో ప్రయాణిస్తున్నారు. ఈక్రమంలో వేగంగా ప్రయాణిస్తూ విద్యుత్ స్తంభాలను ఢీకొట్టి ప్రమాదాలబారిన పడే అవకాశం ఉంది.

కనిపించని ప్రమాద నివారణ చర్యలు

ప్రమాదాల నివారణ కోసం ప్రమాద హెచ్చరిక, సూచిక బోర్డులు, లైట్ రిఫ్లెక్షన్ స్టిక్కర్లను విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేయవలసి ఉంటుంది. కానీ నేటికీ అలాంటి చర్యలు చేపట్టలేదు. విద్యుత్ స్తంభాలు ఉన్నచోట రాత్రివేళల్లో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు లైట్ల వెలుతురులో విద్యుత్ స్తంభాలు అత్యంత సమీపంలోకి వచ్చే వరకు కనిపించకపోవడంతో వాహనదారులు ఒక్కసారిగా భయాందోళనలకు గురవుతున్నారు.

అధికారులే బాధ్యత వహించాలి



మండల కేంద్రంలో రెండేళ్ల క్రితం నిర్మించిన డబుల్ రోడ్డు వెంట ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను నేటికి తొలగించలేదు. దీంతో ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. విద్యుత్ స్తంభాల వల్ల ప్రమాదాలు జరిగితే అధికారులే బాధ్యత వహించాలి.

–జమ్ము రమేశ్, శాలిగౌరారం

అధికారులు నిర్లక్ష్యం వహించొద్దు



వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా హెచ్చరిక బోర్డులు, లైట్ రిఫ్లెక్షన్ స్టిక్కర్లు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ విషయంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దు.

–చలకాని మల్లయ్య, అంబారిపేట

షిఫ్టింగ్ అంచనా వ్యయం చెల్లించలేదు

శాలిగౌరారం–గురుజాల రోడ్డువెంట విద్యుత్ స్తంభాలను తొలగించేందుకు ఆర్అండ్‌బీ శాఖ నుంచి విద్యుత్ లైన్లకు సంబంధించిన షిఫ్టింగ్ అంచనా వ్యయం చెల్లింపు నేటికీ జరుగలేదు. షిఫ్టింగ్ అంచనా వ్యయం చెల్లిస్తే వెంటనే విద్యుత్ లైన్ల మార్పిడి చేస్తాం.

–శ్రీధర్, విద్యుత్ ఏఈ, శాలిగౌరారం